క్లుప్తంగా

హెచ్‌ఎంకు మెమో



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ ఉమాశంకర్

ఇల్లెందురూరల్: దసరా సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభించిన తొలి రోజైన శనివారం విధులకు గైర్హాజరైన మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ సంజయ్‌నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దుర్గయ్యకు ఎంఈఓ ఉమాశంకర్ మెమో జారీ చేశారు. మండలంలోని అన్నారం, మోదుగులగూడెం, మొట్లగూడెం, సంజయ్‌నగర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును శనివారం ఎంఈఓ తనిఖీ చేశారు. హెచ్‌ఎం దుర్గయ్య గైర్హాజరైన విషయం గమనించి మెమో జారీ చేశారు.

మరుగున పడిన ప్రజా మరుగుదొడ్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నగర పరిధిలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు మరుగున పడిపోయాయని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంనకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు పబ్లిక్ ప్లేసులో మరుగుదొడ్లు నిర్మించాలని అనేక పోరాటాలు చేయగా గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట, ఆఫీస్ సంత వద్ద నవభారత్ సహకారంతో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు నేటి పాలకుల అసమర్థత వల్ల కొన్ని నెలలుగా తాళాలు వేసి దర్శనమిస్తున్నాయని, అధికారులు మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురాకపోవడం చాలా దౌర్భాగ్యమన్నారు. ప్రజల అవసరార్థం నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు ఎందుకు తీయకుండా తాళాలు వేశారని పేర్కొన్నారు.

జనరల్‌కు కేటాయించడం సరికాదు



మాట్లాడుతున్న కొమరారం సత్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఆదివాసీ ప్రాంతాలను జనరల్‌కు రిజర్వ్ చేయటం సరికాదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొమరారం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ ప్రజానీకం అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆదివాసీలకు రిజర్వ్ చేయకుండా జనరల్‌కు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అటవీ, ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు దేశంలో ఆదివాసీల హననం కొనసాగిస్తుంటే, ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలకు కల్పించిన హక్కును కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో కందగట్ల సురేందర్, ఉప్పరబోయిన రామ్మూర్తి, మల్లూరి సుగుణ, ఎ.సాంబ, జె.గణేశ్, ఉమ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



సంతోష్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో మిషన్ భగీరథ పైపులైన్లకు సంబంధించిన పనుల్లో ఓ కార్మికుడికి తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సంతోష్‌కుమార్ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో పైపులైన్ కోసం తీసిన గుంతల్లో పనిచేస్తున్న క్రమంలో ఒక్కసారిగా పైనున్న మట్టి అతని మీద పడింది. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే పైపులైన్ గుంతలో దిగి సంతోష్‌కుమార్‌పై పడిన మట్టిని తొలగించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్.. సంతోష్‌కుమార్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శ్రీషిర్డీ సాయిబాబాకు అన్నాభిషేకం

పాల్వంచరూరల్: సాయిబాబా 109వ పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం అన్నాభిషేకం, అఖండ దీపారాధన, ఉద్వాసన, ధుని పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు.

మారిన నే'తలరాతలు'

- అవకాశం దూరమై ఆవిరైన ఆశలు
- ఎన్నికలకు దూరంగా సగం మంది మాజీలు
- రిజర్వేషన్ ప్రక్రియపై సర్వత్రా అసంతృప్తి



ఇల్లెందురూరల్: పల్లెల్లో కొద్దో గొప్పో ఆర్థికంగా ఉన్న వారు.. రాజకీయంగా ప్రాధాన్యత కలిగి ఉన్న కుటుంబాల సభ్యులు స్థానిక సమరంలో పోటీ చేయాలని ఆశించడం సహజమే. ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోటీలో నిలిచేందుకు ముందుగా బడా నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ఆరాటపడుతుంటారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి అభిమానాన్ని చూరగొనేందుకు నానా తంటాలు పడుతుంటారు. ఏడాదికాలంగా ఈ తంతును సాఫీగానే సాగింది. కానీ, వీరి ఆశలకు స్థానిక రిజర్వేషన్ ప్రక్రియ నీళ్లు చల్లుతూ అడ్డుగోడగా నిలిచింది.

ఏడాదిగా ఎదురుచూపులు

సర్పంచ్‌ల పదవీకాలం 2024 ఫిబ్రవరి మాసంలో ఎంపీటీసీల పదవీ కాలం ఆగస్టులో ముగిసింది. నాటి నుంచి మాజీలైన ప్రజాప్రతినిధులు మళ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా బరిలో నిలవాలని ఆశపడ్డారు. అందుకు అనుగుణంగా పదవి లేకున్నా ప్రజల్లోనే ఉంటూ వారికి అవసరాల్లో చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. వీరితోపాటు ఈ దఫా ఎన్నికల్లో పోటీచేయాలని ఆశించిన చోటామోటా నేతలు సైతం పల్లెల్లో పట్టు కోసం తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధికార పక్ష నేతలు ప్రభుత్వ సంబంధిత సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక మొదలు.. వాటి అమలు వరకు తమ ముద్ర ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు. ఇక ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు సైతం లబ్ధిదారుల ఎంపికలో లోపాలను ఎత్తిచూపుతూ పల్లెల్లో పట్టు కోసం తాపత్రయపడ్డారు. ఇలా ఏడాది కాలంగా జేబులు ఖాళీ చేసుకుంటూ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఆశగా ఎదురు చూశారు.

ఎన్నికల ప్రకటనతో..

ఏడాదిన్నర ఎదురుచూపులకు చరమగీతం పాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సమరానికి పచ్చజెండా ఊపింది. అధికార యంత్రాంగం సైతం ఓటరు లిస్ట్ రూపకల్పనతో ఎన్నికలకు సన్నద్ధమైంది. గత ప్రభుత్వం స్థానిక రిజర్వేషన్ రెండు పర్యాయాలు కొనసాగేలా చట్టం చేసినట్లు ప్రకటించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాత రిజర్వేషన్లే మళ్లీ కొనసాగుతాయన్న ఆశతో ఎన్నికల్లో తాము పోటీ చేయాలనుకున్న గ్రామాల్లో ఆశావహులు ఏర్పాట్లు చేసుకోవడం ప్రారంభించారు. కానీ, రిజర్వేషన్లను మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అటు అధికార పార్టీ నేతలకు, ఇటు ప్రతిపక్ష నేతలకు మింగుడుపడని పరిస్థితి తెచ్చిపెట్టింది.

సగం మందిలో నిరాశ

గత ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా కొనసాగిన వారిలో సగం మందికిపైగా తాజా రిజర్వేషన్ ప్రక్రియ అవకాశాలను దూరం చేసింది. ఈదఫా ఎలాగైనా పోటీ చేయాలని ఆశించిన వారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వాస్తవంగా రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభంలో అధికారులు చెప్పిన మాటలు కొంత మందికి ఊరటనిచ్చింది. సర్పంచ్ అవకాశం దూరమైతే ఎంపీటీసీ బరిలో నిలవాలని ఆశించారు. కానీ, ప్రక్రియ ముగియగానే సగం మంది అవకాశాలు గల్లంతయ్యాయి. అయితే, రిజర్వేషన్ ప్రక్రియపై కొందరు నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో మహిళా కోటా ఉన్న స్థానాల్లో ఈ దఫా కూడా మహిళకే అవకాశం ఇవ్వడంపై పెదవి విరుస్తున్నారు. ఇక రేపల్లెవాడ ఎంపీటీసీ స్థానంలో వరుసగా మూడు దఫాలుగా ఎస్టీ మహిళకే అవకాశం ఇవ్వడం యాదృచ్ఛికం కాదని ఆరోపణలు గుప్పిస్తున్నారు. సర్పంచ్ స్థానాల్లో మహిళలకు యాభై శాతం కోటా ఉంటుందని గతంలో పాలకులు ప్రకటించినా ఈ దఫా యాభై శాతం లోపు అవకాశాలు దక్కాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

తలనొప్పిగా మారిన అభ్యర్థుల ఎంపిక

ఎన్నికల ప్రకటన, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో రాజకీయ పక్షాలు అభ్యర్థుల ఎంపిక పనిలో నిమగ్నమయ్యారు. రిజర్వేషన్ పుణ్యమా అని ఇప్పటికే ఆశావహులైన వారికి అవకాశాలు దూరం కావడంతో కొత్తవారి ఎంపిక నేతలకు తలనొప్పిగా మారిందనే చెప్పాలి. ఇక జనరల్‌కు రిజర్వ్ అయిన స్థానాల్లోనూ ఎస్టీలే పోటీకి సిద్ధం కావడంతో ఆయా చోట్ల రెబెల్స్ బెడద తప్పదేమోనని నేతలు కొంత భయాందోళనకు గురవుతున్నారు. ఖర్చు భయంతో కొందరు పోటీకి నిరాసక్తత చూపడంతో సమర్థుల అన్వేషణలో నేతలు పల్లెబాట పట్టారు.

ఎనిమిదో తేదీ టెన్షన్..

టేకులపల్లి: స్థానిక సంస్థల రిజర్వేషన్ల అంశం హైకోర్టులో ఉన్న నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లలో అనుకూలంగా ఉన్న స్థానాలు ఎక్కడ మారుతాయోనని పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్లపై హైకోర్టులో ఈ నెల 8న వాదనలు ఉండగా, మరుసటి రోజు నుంచే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మొదలు పెట్టేందుకు అంతా సిద్ధం చేసుకుంది. 9న పరిషత్ తొలివిడత నామినేషన్ల ప్రక్రియ కావడంతో ఆశావహుల్లో ఆందోళన, మరోవైపు పార్టీ కోసం ఏళ్లతరబడి కష్టపడితే ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్ల వల్ల అవకాశాలు దక్కలేదని పలువురు అధికార పార్టీ, ఇతర పార్టీల నాయకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 8న హైకోర్టు తీర్పుతో ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లు మారుతాయా? అనే చర్చ అన్ని పార్టీల శ్రేణుల్లో సాగుతోంది. ఎక్కడ చూసినా.. ఏ ఇద్దరు కలిసినా.. ఫోన్లలో మాట్లాడుకున్నా ఇవే సంభాషణలు. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు కొందరికీ అనుకూలంగా, మరి కొందరికి ప్రతికూలంగా ఉండటంతో అనుకూలంగా ఉన్నవారు సంతోషంగా ఉన్నప్పటికీ ప్రతికూలంగా ఉన్న వారు రిజర్వేషన్లలో మార్పులు చేర్పులు జరిగితే బాగుండు అని కోరుకుంటున్నారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసి, పదేళ్లలో పలు కేసులు ఎదుర్కొన్నప్పటికీ తమకు పోటీ చేసే అవకాశాలు దక్కలేదని పలువురు అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. టేకులపల్లి జెడ్పీటీసీ జనరల్ మహిళకు, ఎంపీపీ ఎస్టీ మహిళకు కేటాయించడంతో ఇప్పటి వరకు ఈ స్థానాలపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులకు నిరాశ ఎదురైంది. అయినా సరే తగ్గేదేలే అన్నట్లు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు ఇతర పార్టీల ఆశావహులు తమ సతీమణులు, కుటుంబంలోని మహిళలను బరిలో దింపేందుకు ముమ్మర యత్నాలు కొనసాగిస్తున్నారు. ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విషయంలో పలువురు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈనెల 8న హైకోర్టు తీర్పును బట్టి సుప్రీం కోర్టుకు సైతం వెళ్లే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతుండగా మహారాష్ట్రలో గతంలో స్థానిక ఎన్నికలు జరిగిన తరువాత కూడా కోర్టు ఆ ఎన్నికలను రద్దు చేసిందంటూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

రీజినల్ క్రీడా పోటీలు షురూ..



క్రీడాకారులతో ఏరియా జీఎం వీసం కృష్ణయ్య

ఇల్లెందు: వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ 2025 – 26 ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన రీజియన్ స్థాయి క్రీడాపోటీలను ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ప్రారంభించారు. శనివారం 24 ఏరియా క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఒత్తిడి పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఉద్యోగులు రోజు వారీ విధుల్లో భాగంగా ప్రతీ రోజు 30 నిముషాల పాటు తప్పకుండా వ్యాయామం చేయాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఈ పోటీలను సింగరేణి నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, శ్యామ్‌ప్రసాద్, జాన్‌వెస్లీ, నజీర్ అహ్మద్, జె.వెంకటేశ్వర్లు, అజయ్, వెంకటేశ్వర్లు, దాట్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాగర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సాగర్ కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్: గత నెల 24న కొత్తగూడెంలో భవనం పైనుంచి పడి మృతి చెందిన బత్తిని సాగర్ కుటుంబాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. సుజాతనగర్‌లో శనివారం జరిగిన దశదిన కార్యక్రమానికి హాజరైన ఆయన సాగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాగర్‌కు సొంత ఇల్లు లేదని కుటుంబీకులు ఎమ్మెల్యేకు తెలపగా.. ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కొమారి హనుమంతరావు, దస్రు తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న పద్మావతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని సాఫ్ట్‌వేర్ టెక్నికల్ బృందం సహకారంతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ప్రాంతీయ మార్కెటింగ్ ఉప సంచాలకురాలు వి.పద్మావతి, సీపీఓ సంజీవరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావుతో కలిసి పాల్గొని, మాట్లాడారు. పత్తి రైతులకు మరింత సులభతరమైన, పారదర్శకమైన డిజిటల్ విధానంలో కొనుగోలు సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నారని, సమగ్ర సమాచార వేదికగా యాప్ నిలుస్తుందని పేర్కొన్నారు. యాప్ ద్వారా రైతులు పత్తి అమ్మకాల వివరాలు, రోజువారీ మార్కెట్ ధరలు, పంట తూకం వివరాలు, చెల్లింపు సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. యాప్ ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరిగి, రైతులకు సమయానికి న్యాయమైన ధర అందేలా చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగం ద్వారా దళారుల వ్యవస్థ ఉండదని, మార్కెట్ లావాదేవీలపై స్పష్టమైన సమాచారం అందుకోవచ్చని వెల్లడించారు. కపాస్ కిసాన్ యాప్ రైతుల చేతుల్లో సమాచార శక్తిని అందిస్తున్నదని, దీనిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాల పనితీరులో సమయపాలన, సామర్థ్యం పెరుగుతుందని, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా డిజిటల్ పద్ధతిలో జరగడం వల్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు యాప్ వినియోగంపై ప్రాక్టికల్ ప్రదర్శన ఇచ్చారు. ఏఈఓలు, ఎంఏఓలు, ఏడీఏలు, మార్కెటింగ్ సిబ్బందికి దశలవారీగా యాప్ ఉపయోగించే విధానం వివరించారు. జిల్లాలోని వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయాధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొని యాప్, సాంకేతిక అంశాలను నేర్చుకున్నారు.


వైఫల్యాలను ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో బీఆర్‌ఎస్‌కు అంకితభావం, సమర్థత కలిగిన కార్యకర్తల బలం పుష్కలంగా ఉందని, స్థానిక సమరంలో అత్యధిక స్థానాలను వారే గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు మరోమారు శంకుస్థాపన చేయడం మినహా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలో కొత్తగా మంజూరు చేసిన పనులేవీ లేవన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన వాగ్దానాలు, అమలు తీరుపై ప్రజలకు వివరించి చైతన్యం కలిగించాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, దాస్యం ప్రమోద్, లష్కర్, గాజీ, ప్రేం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ పంచాయతీలో గల సింగరేణి పాత పాఠశాలలో 1991 – 2001 (ఫస్ట్ క్లాస్ నుంచి పదో తరగతి) వరకు చదువు పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు (సిల్వర్ జూబ్లీ) కార్యక్రమాన్ని శనివారం రాత్రి రుద్రంపూర్‌లోని నేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పాఠశాల ప్రాంగణంలోకి రాగానే తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు, ఉపాధ్యాయులు దేవీదత్ శ్రీనివాస్, మూర్తి, మేకల రంగారెడ్డి, సులోచన, సుభాషిని, విజయలక్ష్మి, మధురవాణి, జయరూత్, మనోజ్, రాజేశ్, వెంకటేశ్, సౌజన్య, లావణ్య, సతీశ్, నవీన్, సుజాత, రాములు, కిరణ్, యుగంధర్, స్వాతి పాల్గొన్నారు.

పాలస్తీనాకు మద్దతుగా ర్యాలీ

ఇల్లెందు: పాలస్తీనా గాజాలపై అమెరికా సామ్రాజ్యవాద మద్దతుతో ఇజ్రాయిల్ దేశం దాడులు కొనసాగించడానికి నిరసనగా ఈ నెల 7న ఇల్లెందులో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎన్డీ రాష్ట్ర నాయకులు మధు తెలిపారు. శనివారం ఇల్లెందులో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దాడుల్లో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు మృతి చెందుతున్నారని తెలిపారు. ఈ ఘటనకు భారత్‌లోని అన్ని వర్గాలు సంఘీభావం తెలిపి, ర్యాలీలో పాల్గొనాలని కోరారు. జేకే సింగరేణి గ్రౌండ్ నుంచి 11 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ గోవింద్ సెంటర్ వరకు సాగుతుందని పేర్కొన్నారు. 5వ తేదీన సీపీఎం కార్యాలయంలో సన్నాహక సమావేశం ఉంటుందని మధు తెలిపారు.

బస్సుల కోసం పరేషాన్

ఇల్లెందు: తెలంగాణలో పెద్ద పండుగలు బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారు సొంత ఇళ్లకు, కార్యాలయాలకు తిరుగు పయనం కావటంతో బస్సుల కోసం రద్దీ పెరిగింది. కోటమైసమ్మ జాతరకు విచ్చేసిన భక్తుల రాకపోకల ప్రభావం కూడా బస్సులపై పడింది. మహిళలు ఉచిత బస్ ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటుండటం వల్ల ప్రయాణికుల సంఖ్య విపరీతంగా ఉంటోంది. శనివారం తెల్లరుజాము నుంచే ఇల్లెందు బస్టాండ్ కిటకిటలాడింది. గుండాలలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం, ధ్వజస్తంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో ఆ మార్గంలో రద్దీ నెలకొంది. పట్టణంలో పలుచోట్ల బస్సులు ఆపకపోవడంతో అందరూ బస్టాండ్‌కు చేరుతున్నారు. సరిపడా బస్సులు లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

విజయవంతం చేయాలి

పాల్వంచరూరల్: డిసెంబర్‌లో ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదానికి ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్న సన్నాహక సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు కోరారు. మండల పరిధిలోని మల్లారం, రేగులగూడెం, చంద్రాలగూడెం, ఉల్వనూరు, బంజర లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఆయన పాల్గొన్నారు. నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీనివాసరావు, నిట్టా అమృతరావు, వజ్జ సత్యం, కోరం స్వర్ణలత, రాజేశ్, బాబూరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే సాధ్యం

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం, నాగారం గ్రామాల్లో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ.. సీఎం నాయకత్వంలో సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని వివరించారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, ధర్మసోత్ ఉపేందర్, కొండం పుల్లయ్య, పెండ్లి రామిరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జేఏసీ నేతల వినతి



మాట్లాడుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏజెన్సీ భూభాగంలో ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తరువాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో నూతన పంచాయతీ రాజ్ చట్టం తీసుకువచ్చారని, దీంతో ఎస్టీ, జనరల్ రిజర్వేషన్ విధానాంతో ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు అన్యాయం జరిగిందన్నారు. 2025లో కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే పాలసీ అమలు చేయడం వల్ల ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు మరోసారి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి మండలంలో ఒకటి, లేదా రెండు, మూడు, ఎంపీటీసీలు ఉండేవని అన్నారు. కొత్తగూడెం, భద్రాచలం, చర్ల, పినపాక, అశ్వాపురం మండలాల ఐదు జడ్పీటీసీలు ఉండేవని తెలిపారు. ఎస్టీ, జనరల్ రిజర్వేషన్ చేయడం వల్ల ఎస్సీ కులాలకు రాజ్యాంగం కల్పించిన రాజకీయ హక్కు, ప్రాతినిధ్యం కోల్పోయి అన్యాయానికి అవమానానికి గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి చేరే విధంగా నివేదికలు పంపాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మోదుగు జోగారావు, కొండ జంపన్న, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ జిల్లా నాయకులు సలిగంటి కొమరయ్య, కండే రాములు తదతరులు పాల్గొన్నారు.

స్పందించే వరకూ సమ్మె



రొంపేడులో ఆందోళన చేస్తున్న వర్కర్లు

ఇల్లెందురూరల్: ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు స్పష్టం చేశారు. మండలంలోని రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఆందోళన చేపట్టారు. సమ్మె శిబిరాన్ని జేఏసీ నేతలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, టైమ్ స్కేల్ అమలు చేయాలనే తదితర డిమాండ్లతో 23 రోజులుగా సమ్మె చేస్తున్నా పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, జేఏసీ నేతలు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, రమాకల, మంగ, స్వామి, తారాబాయి, నాగేశ్వరరావు, వజ్జ సురేశ్ పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది..



అన్నదానం చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక పాత పాల్వంచ శ్రీ షిరిడీ సాయిబాబా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సాయిబాబా 107వ పుణ్యస్థితి (సమాధి) పూజోత్సవాల్లో భాగంగా పూజారి దాసోజ్ సతీశ్‌ఆచార్యులు ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, ఉద్వాసన, ధుని పూజలు చేశారు. అనంతరం సుమారు వెయ్యి మంది భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముత్యాల కోటేశ్వరరావు, కొత్వాల సత్యనారాయణ, గంధమల్ల రాజయ్య, నాసరయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రమేశ్, జనార్దన్‌రెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, వై.వెంకటేశ్వరరావు, పాశం నరసింహారావు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెనిఫిట్స్ అన్నీ ఇవ్వాలి..

కొత్తగూడెంఅర్బన్: కారుణ్య ఉద్యోగాలు, ఎంఎంసీ, ఎల్‌ఎస్‌పీ, టెర్మినల్ బెనిఫిట్స్ త్వరితగతిన పూర్తి చేయాలని జీఎం (పర్సనల్) వెల్ఫేర్ సీఎస్ఆర్ నారాయణరావు అన్నారు. శనివారం ఆయన అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డులు ఉద్యోగ విరమణ రోజున ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీజీఎం ముకుంద సత్యనారాయణ, అన్ని ఏరియాల పర్సనల్ హెడ్స్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.